
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# మనవాడేనా!

వడ్డి ఓంప్రకాశ్ నారాయణ



'మనవాడేనా...' అనే పదాన్ని మొదట్లో ఏ అర్థంతో ఉపయోగిస్తున్నారో గోపాలానికి అర్థం కాలేదు. ఆఫీసులో కొత్తవాళ్ళకి తనని  పరిచయం చేస్తుంటే... చాలా మామూలుగా ఆ కొత్త వ్యక్తి 'మనవాడేనా...' అని అడుగుతుంటే అర్థం కాక అయోమయంగా వారిద్దరి వంకా చూసేవాడు గోపాలం. తాను పుట్టి, పెరిగిన భీవండీలో ఈ  పదాన్ని అతను వినలేదు. ఆంధ్రప్రదేశ్ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే అనేక సందర్భాలలో 'మనవాడేనా...' అనే పదం అతని చెవిలో పడుతూ వచ్చింది.  ఈ పదం బలం ఏమిటో గోపాలానికి అవగతం కావడానికి పెద్ద తతంగమే జరిగింది.

* * *

గోపాలం బాల్యమంతా మహారాష్ట్ర లోని భీవండీలో గడిచింది. అతని తండ్రి వెంకటేశంది కృష్ణాజిల్లాలోని ఓ చిన్న పల్లె. కవుతరం. వ్యవసాయ కూలీగా వెంకటేశం కుటుంబం జీవనం సాగిస్తుండేది. వరుసగా రెండేళ్ళ పాటు వచ్చిన గాలివాన చేతికొచ్చిన పంటను చిందరవందర చేయడంతో ఊహించని కరువు ఆ ఊరిని  కౌగలించుకుంది. ఆస్తిపాస్తులున్న పెద్ద రైతులు  ఆ కరువును ధైర్యంగా ఎదుర్కొన్నారు. కూలి మీద ఆధారపడిన వెంకటేశం కుటుంబం మాత్రం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో తండ్రికి భారం కావడం ఇష్టం లేని  వెంకటేశం ఊరొదిలి పొట్ట చేతపట్టుకుని విజయవాడ వచ్చి... అక్కడ మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. మర్నాడు మధ్యాహ్నం నిద్రలేచే సరికి రైలు విక్టోరియా టెర్మినల్స్‌లో ఆగి ఉంది. అలా బొంబాయి చేరిన వెంకటేశం కడుపు నింపుకోవడానికి నానా తిప్పలు పడ్డాడు. చివరికి తెలుగు తెలిసిన ఓ వ్యక్తితో పరిచయం కావడంతో అతని ఆసరాతో భీవండీ చేరాడు. అక్కడ తెలంగాణా గ్రామాల నుండి వెళ్ళిన చాలా మంది మగ్గాన్ని నమ్ముకుని సుఖంగా జీవితాన్ని గడపడం వెంకటేశం గమనించాడు. అతనికి ఆ వాతావరణం, ఊరు బాగా నచ్చాయి. అక్కడే ఉండిపోవాలని అనుకున్నాడు. భీవండీలోని భావనారుషి పాఠశాలలో  ఉద్యోగం చేరాడు. ఇంతలో ఊరిలో గోడకూలి

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

తల్లిదండ్రులిద్దరూ చనిపోయారనే వార్త తెలిసి, వెళ్ళి కర్మకాండలు నిర్వర్తించి వచ్చాడు. అక్కడితో అతనికి సొంత ఊరు కవుతరంతో బంధం తెగిపోయింది.

నాలుగేళ్ళు గడిచిన తర్వాత అదే స్కూల్‌లో మరాఠీ పాఠాలు చెప్పే సుమతీ ఖోస్లాను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు వెంకటేశం. తెలుగు కుర్రాడిని తమ కూతురు పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేని ఆమె తల్లిదండ్రులు కూతురుతో తెగతెంపులు చేసుకున్నారు. పెద్దల ఆసరా లేకపోయినా వెంకటేశం, సుమతి ఖోస్లా మధ్య చక్కని అవగాహన ఉండటంతో ఏ రోజునా వాళ్ళు బాధపడింది లేదు. రెండేళ్ళకి వారికో అబ్బాయి పుట్టాడు. బారసాల రోజున కొడుకును ఒడిలోకి తీసుకున్న సమయంలో వెంకటేశానికి చనిపోయిన తన తండ్రి మనసులో మెదిలాడు. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. పిల్లాడికి తన తండ్రిపేరు గోపాలం అని పెడతానని అన్నాడు. భార్య సుమతి సరే అంది. తల్లితోనూ, ఇంటి బయటా గోపాలం మరాఠీ మాట్లాడేవాడు. తండ్రి కారణంగా తెలుగు మాట్లాడటమూ అలవాటైంది. వెంకటేశం తనకు తెలిసిన నాలుగు ముక్కల తెలుగును కొడుక్కి నేర్పాడు. పైగా ప్రాథమిక విద్య అంతా భీవండీలోని తెలుగు స్కూల్‌లోనే జరిగింది. అక్కడే ఇంటర్ కూడా పూర్తి చేశాడు. కానీ డిగ్రీ సీటు మాత్రం కళ్యాణ్‌లో వచ్చింది. ఫైనలియర్ ఎగ్జామ్ పూర్తి చేసి ఇంటికి వచ్చిన గోపాలం కోసం ఊహించని వార్త ఒకటి ఎదురుచూస్తూ ఉంది. దాదర్ నుండి ఛత్రపతి శివాజీ టెర్మినల్స్‌కు వెళ్ళే లోకల్ గాడీలో తీవ్రవాదులు పెట్టిన బాంబు పేలి నలభై మందికి పైగా మరణించారు. అందులో గోపాలం తల్లిదండ్రులూ ఉన్నారు. ఈ వార్త వినగానే గోపాలం కుప్పకూలిపోయాడు. భవిష్యత్ అంతా శూన్యంగా కనిపించింది. అయితే కాలానికి బలమైన గాయాలను కూడా మాన్పించే శక్తి ఉండటంతో అదే మందు గోపాలానికీ పనిచేసింది. గతాన్ని మర్చిపోయి, అందమైన భవిష్యత్‌ను నిర్మించుకునే దిశగా ఆలోచనలు మొదలుపెట్టాడు. ముందు ఈ ఊరికి దూరంగా వెళ్ళాలని అనిపించింది. అదే సమయంలో ఓ ప్రముఖ రవాణా సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని తమ శాఖలలో ఖాళీలున్నాయనే ప్రకటన ఇచ్చింది. గోపాలం ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు. అతనికున్న అర్హతల్ని పరిశీలించి ఇంటర్వ్యూ చేసిన తర్వాత రావ్ అండ్ రావ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ గోపాలానికి ఉద్యోగం ఇస్తూ, శ్రీశైలంలోని శాఖలో పోస్టింగ్ అన్న లేఖ పంపింది. దాదాపు పాతికేళ్ల పాటు మహారాష్ట్రలో జీవితాన్ని సాగించిన గోపాలం మొట్టమొదటిసారి తన తండ్రి స్వరాష్ట్రంలోకి అడుగుపెట్టాడు. అసలు కథ అక్కడే మొదలైంది.

* * *


శ్రీశైలం లాంటి పుణ్యక్షేత్రంలో మొట్టమొదటి పోస్టింగ్ రావడం, పైగా తన తండ్రి స్వరాష్ట్రంలో ఉద్యోగం రావడంతో గోపాలం ఎంతో సంతోషపడ్డాడు. ఓ మంచి రోజు చూసుకుని హైదరాబాద్ మీదుగా శ్రీశైలం చేరిపోయాడు. ఊర్లో దిగీదిగగానే ఆఫీస్ గెస్ట్‌హౌస్‌లో సామాను పడేసి, స్నానాదులు ముగించుకుని తిన్నగా భ్రమరాంబసమేత శ్రీశైల మల్లన్నను దర్శనం చేసుకున్నాడు. అడుగు ఎత్తు కూడా లేని ఆ మల్లన్న శివలింగాన్ని కోట్లాదిమంది భక్తిశ్రద్ధలతో కొలుస్తుండటం నిజంగా విశేషంగానే అనిపించింది గోపాలానికి. ఆ తర్వాత ఆఫీస్‌కు వెళ్ళి బ్రాంచ్ మేనేజర్ రామ్మోహనరావును కలిశాడు. ఆయన సాదరంగా గోపాలానికి ఆహ్వానం పలికాడు. ఇదే మొదటి ఉద్యోగం... పైగా కొత్త ప్రదేశం కాబట్టి వెంటనే కంపెనీ వ్యవహారాల్లో మునిగిపోకుండా.... ముందు ఆంధ్రా వాతావరణానికి అలవాటు పడమని రామ్మోహనరావు సలహా ఇచ్చారు. ఆఫీస్‌లో మరీ ఎక్కువ స్టాఫ్ లేరు. మొత్తం మీద పాతిక మంది వరకూ ఉన్నారు. పదిన్నరకు తన ఛాంబర్‌కు స్టాఫ్‌ను పిలిచి, కొత్తగా వచ్చిన అక్కౌంట్స్ అసిస్టెంట్ అంటూ వారికి గోపాలాన్ని పరిచయం చేశారు రామ్మోహనరావు. అందరితో కరచాలనం చేసి, గదిలోంచి బయటకు వస్తుంటే అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్ రామ్మోహనరావు గారిని 'ఏం సార్... ఈ కుర్రాడు మనవాడేనా?' అని అడగటం గోపాలం చెవిలో పడింది.

* * *

మధ్యాహ్నం భోజనాల సమయమైంది. ఆఫీస్‌లోని దాదాపు అందరూ లంచ్‌బాక్సులు తెచ్చుకున్నారు. రామ్మోహనరావు గోపాలం టేబుల్ దగ్గరకు వచ్చి, 'మన ఆఫీస్‌లో క్యాంటీన్ లేదు. నువ్వు సొంతంగా చేతులు కాల్చుకునేంత వరకూ బయట భోజనం తప్పదేమో... దేవస్థానం ముందు వీధిలోకి వెళ్లితే బోలెడన్ని ఉచిత అన్నదాన సత్రాలు ఉన్నాయి. ఈ రెండు రోజులు అక్కడెక్కడైనా తినేసెయ్'' అన్నారాయన. గోపాలంకు కూడా కడుపులో ఎలుకలు తిరగడం మొదలైంది. అంతవరకూ చూస్తున్న ఫైల్‌ను పక్కన పెట్టి ఆఫీస్‌లోంచి రోడ్డు మీదకు వచ్చాడు.

తన ఆఫీస్‌కు దేవస్థానానికి పెద్ద దూరం లేదు. పదినిమిషాలు నడక అంతే. ఇటు మధ్యాహ్నం లంచ్ చేసినట్టు ఉంటుంది, ఊరు చూసినట్టు ఉంటుందీ అని అలా కాలినడకన బయలు దేరాడు. గుడి ముఖద్వారం ఎదురుగా రోడ్డు మీద అటు ఇటు చిన్న చిన్న దుకాణాలు ఉన్నాయి. వాటిల్లోంచి శ్రీశైల మల్లన్న సుప్రభాతం, లింగాష్టకం, బిల్వాష్టకం వగైరాలు టేప్ రికార్డుల్లోంచి వినిపిస్తున్నాయి. భక్తుల రద్దీ కూడా బాగానే ఉంది.

దుకాణాలను చూసుకుంటూ ముందు కెళ్ళిన గోపాలానికి ఎడమవైపున 'కరివెన బ్రాహ్మణ ఉచిత అన్నదాన సత్రం' అనే బోర్డు కనిపించింది. అన్నపూర్ణదేవి శివుడికి ఆహారాన్ని అందిస్తున్న దృశ్యం అక్కడ గోడమీద చిత్రీకరించి ఉంది. మరికొంత ముందుకు వెళ్ళిన గోపాలానికి 'శ్రీ కన్యకాపరమేశ్వరి వైశ్య ఉచిత అన్నదాన సత్రం' కనిపించింది. గోపాలం మరో నాలుగు అడుగులు వేశాడు... కుడి పక్కన 'శ్రీ కృష్ణదేవరాయ కాపు ఉచిత అన్నదాన సత్రం'.... మరికొంత ముందుకు పోతే 'రెడ్డి ఉచితాన్నదాన సత్రం'. ఆ తర్వాత 'కమ్మ ఉచిత అన్నదాన సత్రం', ఇంకాస్త పైన 'పద్మశాలి ఉచిత అన్నదాన సత్రం', 'గౌడ ఉచితాన్నదాన సత్రం', ఆ పైన 'పెరిక ఉచిత అన్నదాన సత్రం'... ఇలాంటివే మరో ఆరేడు అన్నదాన సత్రాలు...



అలా ముందుకు సాగుతున్న గోపాలానికి ఎటు పోవాలో అర్థం కాలేదు. తాను ఏ సత్రంలోకి వెళ్ళాలి. అక్కడకు వెళ్ళిన తర్వాత తన కులం ఏమనిచెప్పాలి. గోత్రం అడిగితే ఏం సమాధానం చెప్పాలి. అయినా మనిషిని కులం అడిగి భోజనం పెట్టేది ఇదేం సంప్రదాయం. ఇంతవరకూ తనని ఏ కులం అని అడిగిన వారే లేరు. మహారాష్ట్రలో ఉండగా ఒకటి రెండు సార్లు 'మీరు ఎవరు' అనే ప్రశ్న తనను కొందరు వేసినా, 'ఆంధ్రావాడిని' అనో, 'మా అమ్మ మరాఠీ' అనో సమాధానమే చెప్పాడు తప్పితే.... నా కులం ఇది అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం కూడా రాలేదు. డిగ్రీలో చేరేసమయంలోనూ కులం అనే కాలమ్ దగ్గర గీత కొట్టి, జాతీయత అనే కాలమ్ దగ్గర 'హిందూ' అని మాత్రమే రాశాడు. జీవితంలో మొట్టమొదటిసారి ఈ శ్రీశైల పుణ్యక్షేత్రంలో తన కులం ఏమిటో తెలుసుకుని భోజనం చేయాల్సిన అగత్యం పడుతుందని గోపాలం ఊహించలేదు.

అలా తనకు తెలియకుండానే రెండుమూడు కిలోమీటర్లు నడిచే సరికీ గోపాలానికి కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. ఇక ఏమీ ఆలోచించకుండా పక్కనే ఉన్న ఓ టీ బంక్‌లో చాయ్‌తాగి వెనక్కి బయలుదేరాడు.

* * *

ఆఫీస్‌కు వెళ్ళిన తర్వాత కూడా గోపాలాన్ని ఆ ఉచిత అన్నదాన సత్రాల బోర్డులే వెంటాడుతూ ఉన్నాయి. గోపాలంలో ఉదయం ఉన్న ఉత్సాహం సాయంత్రానికి లేకపోవడం రామ్మోహనరావు గమనించారు. తన క్యాబిన్‌కు పిలిపించి, కూర్చోమని 'ఎక్కడ భోజనం చేశావ్... ఎలా ఉంది భోజనం? మీ రాష్ట్రానికీ ఇక్కడకు ఆహార వ్యవహారాల్లో కొంత తేడా ఉంటుంది. నిదానంగా అలవాటు పడిపోతావులే' అని అనునయంగా అన్నారు. తన మనసులోని బాధను వెంటనే రామ్మోహనరావుగారితో పంచుకోలేకపోయాడు గోపాలం.

'థ్యాంక్స్' అని చెప్పి క్యాబిన్‌లోంచి బయటపడ్డాడు.

ఆ రాత్రి ఆఫీస్ గెస్ట్ హౌస్‌కి చేరి, కాస్త విశ్రాంతి తీసుకున్న తర్వాత వాచ్‌మేన్ వచ్చి 'సార్ భోజనానికి వెళ్ళరా?' అని ప్రశ్నించాడు. గోపాలానికీ ఆకలిగానే ఉంది. కానీ ఆ అన్నదాన సత్రాలను చూస్తుంటే ఏదో పాత రాతియుగంలోకి సమాజం వెళ్ళిపోయినట్టుగా అనిపిస్తోంది. ఇంత బాహాటంగా మనుషులు తమ కులాల్ని ప్రొజెక్ట్ చేసుకుంటూ అన్నదాన సత్రాలను నిర్మించి నిర్వహిస్తుంటే ప్రభుత్వం ఎలా చూస్తూ ఊరుకుంటోంది అనిపించింది. వాళ్ళ నిర్వహణ వాళ్ళ ఇష్టం సరే! కానీ తాను ఏ సత్రంలోకి వెళ్ళి భోజనం చేయాలి. తల్లిదండ్రులు బతికి ఉండగా ఏ రోజునా 'నాన్నా మన కులం ఏమిటీ?' అని తాను అడగనే లేదు. దాని అవసరం వస్తుందనీ అనుకోలేదు. ఏ రోజునా కులం అనే ప్రసక్తే రాకుండా తల్లిదండ్రులు ఏ పొరపొచ్చాలు లేకుండా జీవితాన్ని గడిపిన రోజులు గోపాలానికి గుర్తుకొచ్చాయి. కనుకొలనుల నుండి కన్నీరు జారి దిండును తడిపేసింది. ఆకలి చచ్చిపోయింది. అలానే తన బాల్యాన్నీ, భీవండీలో తాను గడిపిన రోజుల్ని తలుచుకుని నిద్రలోకి జారిపోయాడు.

* * *

మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని ఏమీ తినకుండానే గోపాలం ఆఫీస్‌కు వెళ్ళాడు. అతనిలోని నిద్రలేమిని రామ్మోహనరావు గమనించారు. కొత్త ప్రదేశం కాబట్టి రాత్రి నిద్ర పట్టి ఉండదని అనుకున్నారు. గోపాలం నిదానంగా పనిలో పడిపోయాడు. మధ్యాహ్నం లంచ్ సమయంలో కూడా సీటులోంచి లేవలేదు. అతనికి దేవస్థానం ప్రధాన వీధిలోకి వెళ్ళాలంటేనే మనస్కరించడం లేదు. ఆఫీస్ బోయ్‌తో రెండు ఇడ్లీలు తెప్పించుకుని వాటితోనే లంచ్ అయిందనిపించాడు. గోపాలంలోని నిర్లిప్తతను రామ్మోహనరావు గారు గమనిస్తూనే ఉన్నారు. ఆ సాయంత్రం ఆఫీస్ అయిన తర్వాత గోపాలంతో పాటు ఆయనా గెస్ట్ హౌస్‌కు వెళ్ళారు. గోపాలం ముందు రోజురాత్రి ఏమీ తినలేదని, ఉదయం కూడా టిఫిన్ చేయలేదని వాచ్‌మేన్ రామ్మోహనరావుగారికి ఫిర్యాదు చేశాడు. గోపాలం ప్రవర్తన ఆయనకు కాస్త వింతగా అనిపించింది. వయసులో ఉన్న కుర్రాడు... కొత్త ప్రదేశాన్ని, కొత్త వాతావరణాన్ని ఎంజాయ్ చేయకుండా ఇలా రెండు రోజుల్లోనే కుచించుకుపోవడం ఆయనకు కాస్త బాధగా అనిపించింది. గోపాలం భుజం తట్టి, 'ఏ బాధ ఉన్నా మనసులో దాచేసుకోకు.... నాతో షేర్ చేసుకో... నేను నీకు తండ్రిలాంటివాడిని' అన్నారాయన అనునయంగా.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

ఆయన తన మీద చూపిస్తున్న ఆదరణకు గోపాలం కాస్త కరిగాడు. నిన్న మధ్యాహ్నం నుండి తన మనసులో జరుగుతున్న సంఘర్షణను ఆయన ముందు ఏకరువు పెట్టాడు. గోపాలం బాధనంతా ఓపిగ్గా విన్నారు రామ్మోహనరావు. మధ్యలో వాచ్ మేన్ వాళ్ళిద్దరికి చిక్కని కాఫీ అందించాడు. వేడి వేడి కాఫీ తాగడం వల్ల, మనసులోని బాధను మరొకరితో పంచుకోవడంతోనూ గోపాలం కాస్త స్థిమిత పడ్డాడు.

'ఇక్కడ కులాల పేరుతో జరుగుతున్న అన్నదానం నాకు చాలా అశాంతిని కలిగిస్తోంది. దానితో పాటుగా నేనెవరో తెలియకుండా ఇంతకాలం ఎలా పెరిగానా?' అనే ప్రశ్నకూడా నన్ను వేధిస్తోంది' అన్నాడు గోపాలం చివరకు.

అతని బాధను ఆయన అర్థం చేసుకున్నారు.

'ముందు భోజనానికి వెళ్ళి ఆ తర్వాత నీ సమస్య గురించి ఆలోచిద్దాం... సరేనా' అన్నారాయన. రామ్మోహనరావు గారు ముందు నడుస్తుంటే ఆయన్ని అనుసరిస్తూ గోపాలం అడుగులేశాడు.

రామ్మోహనరావు తన ఇంటికి కాకుండా దేవస్థానం ప్రధాన వీధిలోకే గోపాలాన్ని తీసుకొచ్చారు. యథావిధిగా వాళ్ళకు మొదట కరివెన బ్రాహ్మణ ఉచిత అన్నదాన సత్రమే ఎదురైంది. రామ్మోహనరావుగారు అందులోకి అడుగు పెట్టారు. ఆ వెనకే గోపాలం. కానీ అక్కడ తనకే పరాభవం ఎదురవుతుందోననే సందేహం గోపాలాన్నీ వెంటాడుతూనే ఉంది. వరండాలోని రిసెప్షన్ లో కూర్చున్న ఇద్దరు పెద్దలు రామ్మోహనరావును చూసి లేచి నిలబడి సాదరంగా ఆహ్వానించారు.

'ఇవాళ మీ ఆతిథ్యం స్వీకరించడానికి వచ్చాను' అన్నారు రామ్మోహనరావు.

'తప్పకుండా...' అంటూ ఆయన మీల్స్ టోకన్ ఒకటి తీసిచ్చాడు.

తన వెంట ఉన్న గోపాలాన్ని వాళ్ళకి పరిచయం చేస్తూ, 'ఈ అబ్బాయి గోపాలం. మా ఆఫీస్‌లో కొత్తగా చేరాడు. మహారాష్ట్ర నుండి వచ్చాడు... అతనూ ఇవాళ మన దగ్గరే భోజనం చేస్తాడు' అని అన్నారాయన.

వెంటనే రిజిస్టర్ తీసి అందులో పేరు అనే కాలమ్‌లో 'గోపాలం' అని రాసి, 'మీ గోత్రం' అని అడిగారు.

గోపాలం నీళ్ళు నములుతుంటే 'కౌండిన్యస' అని చెప్పారు రామ్మోహనరావుగారు.

బతుకు జీవుడా అనుకున్నాడు గోపాలం.

ఇద్దరూ టోకెన్లు తీసుకుని లోపల హాల్లోకి వెళ్ళారు. అప్పటికే ఆరేడు వరుసల్లో జనం కూర్చుని భోజనం చేస్తున్నారు. రామ్మోహనరావు గారూ ఓ వరుసలో కూర్చుకున్నారు. గోపాలం కూడా ఆయన పక్కనే కూర్చున్నాడు. వరుసగా విస్తర్లు వడ్డించే సమయంలో భోజనానికి కూర్చున్న అందరూ చొక్కాలు విప్పి ఒళ్ళో పెట్టుకుంటున్నారు. అందరికీ జంధ్యాలు ఉన్నాయి. 'మరి తనకు జంధ్యంలేదే...!' పెద్ద సందేహమే వచ్చింది గోపాలానికి.

అదే విషయాన్ని రామ్మోహనరావు గారి చెవిలో చెబితే... 'ఖంగారు పడకు... ఎవరైనా అడిగితే... ఉపనయనం కాలేదని చెప్పు' అన్నారు చిరునవ్వుతో.

ఇంత ఇబ్బంది పడుతూ ఇక్కడ భోజనం చేయకపోతేనేం.... అనుకున్నాడు గోపాలం. అయితే ఆ తర్వాత అక్కడి వాళ్ళు కొసరి కొసరి ప్రేమగా వడ్డన చేస్తుంటే... రెండు రోజులుగా సరిగా ఏమీ తినలేదేమో.... కడుపునిండా భోజనం చేశాడు. తిరిగి హాల్లోకి వచ్చాక పక్కనే ఓ హుండీకనిపించింది. రామ్మోహనరావు గారు జేబులోంచి యాభై రూపాయలు తీసి అందులో వేశారు.

ఇద్దరూ తిరిగి మళ్ళీ గెస్ట్‌హౌస్‌కు వచ్చారు.

ఇప్పుడు గోపాలం కాస్త స్థిమితంగా ఉన్నాడు.

'ఇంతకూ నన్ను భోజనానికి ఆ సత్రంకే ఎందుకు తీసుకెళ్ళారు?' అని రామ్మోహనరావు గారిని అడిగాడు గోపాలం.

ఆయన చిరునవ్వుతో.... 'మనకు దగ్గరగా ఉంది అదే కదా... అందుకనే అక్కడకెళ్ళాం. అందులోనే కాదు ఎందులో అయినా ఆకలితో వెళ్ళిన వాళ్ళకు కడుపు నిండా భోజనం పెడతారు. ఏమీ ఆశించకుండానే. అదే ఇక్కడి సత్రాల్లో ఉన్న గొప్పదనం. నువ్వు బయట ఉన్న పేరు మాత్రంచూసి, ఆ కులం వాళ్ళకే అక్కడ ఉచితంగా భోజనం లభిస్తుందని భావించావ్. అందులో నిజం లేదు. నీకో విషయం చెప్పనా... పాతికేళ్ళ క్రితం నేను శ్రీశైలం వచ్చిన తొలిరోజుల్లోనూ నీలాగే చాలా ఆవేశంతో ఈ వ్యవహారం చూసి ఊగిపోయాను. కూకటివేళ్ళతో పెకిలించాల్సిన కులాల్ని ఇక్కడ ఇంత బాహాటంగా సమర్థించడం, ఇలా కులాల పేరుతో అన్నదాన సత్రాలను నిర్వహించడం ఏమిటనే కోపమూ వచ్చేసింది. అయితే నేను నీలాగా నీరసపడిపోలేదు. దీనిని ఎలాగైనా ఆపాలని కొంత ప్రయత్నం చేశాను'' అన్నారు రామ్మోహనరావు.




ఇదంతా గోపాలానికి ఆశ్చర్యంగా అనిపించింది. తనలాగే పాతికేళ్ళ క్రితమే రామ్మోహనరావుగారు స్పందించారంటే సంతోషంగా అనిపించింది.

'నా ఆవేశంలో అర్థం ఉంది. నా నేపథ్యమే వేరు. కానీ మీరు అలా ఎలా స్పందించారు?' అని అడిగాడు గోపాలం.

సమాధానంగా రామ్మోహనరావు గారు తన గతాన్ని తలుచుకుంటూ 'మా నాన్నగారు సోషలిస్టు. ఆయనకు కులం గోత్రం అనేవి నచ్చేవి కావు. నన్నూ అలానే పెంచారు. ఆయనకు నేనొక్కడినే కొడుకుని. నేనోసారి కాలేజీ మిత్రులతో కలిసి శ్రీశైలం విహార యాత్రకు వచ్చాను. మేమంతా పాతికమందిమి. ఒకే బస్‌లో వచ్చాం. కానీ ఇక్కడ దిగగానే ఎవరి కుల సత్రాలకు వాళ్ళు వెళ్ళిపోయారు. కులం పేరుతో గుర్తింపు పొందడం ఇష్టం లేని నేను మాత్రం నడిరోడ్డులో ఒంటరిగా నిలుచుండిపోయాను. ఈ వ్యవస్థ మీద నాకు పిచ్చ కోపం వచ్చింది. కులం లేని వాడికి ఇక్కడ చోటే లేదా అని బాధకలిగింది. భక్తితో వచ్చే హిందువుల కోసం కుల ప్రసక్తి లేకుండా ఓ అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఆ

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

ఆవేశం నుండి కలిగింది. డిగ్రీ పూర్తి కాగానే నా ఆలోచనను ఆచరణలో పెట్టే ప్రయత్నం చేశాను. దేవస్థానానికి దగ్గరలో ఓ పెద్ద ఇంటిని అద్దెకు తీసుకుని 'హిందూ ఉచిత అన్నదాన సత్రం' అని బోర్డు పెట్టాను. అతి కొద్ది రోజుల్లోనే నా ఆవేశమనే పాల పొంగు మీద కుండపోతగా వర్షం పడినట్టు అయింది. దైవదర్శనానికి కులరహితంగా క్యూలో నిలుచునే భక్తులు ఆ తర్వాత భోజనాలకు మాత్రం వాళ్ళ వాళ్ళ కుల సత్రాలకే వెళ్ళడానికి ప్రాధాన్యమిచ్చేవారు. దగ్గరగా ఉందనో, మరే ఇతర కారణంగానో మా హిందూ ఉచిత అన్నదాన సత్రానికి వచ్చేవారే కానీ కులాన్ని విస్మరించి వచ్చేవారు కాదు. అప్పుడే నాకు జ్ఞానోదయమైంది. ఈ దేశంలో కులాన్ని కూకటివేళ్ళతో పెకలించడం అంత సులభం కాదు. ఎందుకంటే ఇక్కడ కులాలను బట్టే వ్యక్తులకు అదనపు సౌకర్యాలు లభించే అవకాశాన్ని రాజ్యాంగమే కల్పించింది. సమాజంలో అసమానత తొలగిపోయిన రోజున ఈ రిజర్వేషన్లను రద్దు చేయమని వాటిని ఏర్పాటు చేసిన వాళ్ళే స్పష్టంగా చెప్పినా, వాటిని రద్దు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్ధంగా లేదు. ఎందుకంటే ఇవాళ కులం ఓ ఓట్‌బ్యాంక్‌గా రూపాంతరం చెందింది. ఆ తర్వాత మండల కమిషన్ కారణంగా దేశం అగ్నిగోళంగా మారిపోయింది. ప్రతి వాళ్ళు కులం పేరుతో గుర్తింపు పొందడానికే ప్రాధాన్యం ఇవ్వడం మొదలైంది. కొందరు మేధావులు ఈ కులాల హద్దుల్ని చెరిపేయాలని చూసినా అవి కేవలం మానసికమైన స్థాయిలోనే జరిగాయి. ఎందుకంటే ఇక్కడ ఓ వ్యక్తి తన మతాన్ని మార్చుకునే అవకాశం ఉంది. కానీ కులాన్ని మార్చుకునే అవకాశం లేదు. మనం ఏ కులంలో పుట్టామో అదే కులంలో చనిపోవాల్సిందే. ఇటువంటి నేపథ్యంలో నా ఆవేశం ఎందుకూ కొరగానిదని తేలిపోయింది. కొద్దిరోజులకే మా అన్నదాన సత్రాన్ని మూసేసి బుద్ధిగా ఉద్యోగంలో చేరిపోయాను. కులాభిమానం ఉండటంలో తప్పులేదు, కుల దురభిమానాన్ని ప్రోత్సహించకూడదనే సిద్ధాంతాన్ని ఆచరిస్తూ జీవితం గడిపేస్తున్నాను'' అని గాఢంగా నిట్టూర్చారు రామ్మోహనరావు.

కాసేపు గోపాలం ఏమీ మాట్లాడలేదు. ఇంకా అతనిలో ఏదో అసంతృప్తి!!

''ఇవన్నీ పక్కన పెట్టండి. వచ్చిన దగ్గర నుండి నేనంటే మీరు ప్రత్యేక అభిమానం చూపుతున్నారు. ఎందుకనీ?'' అడిగాడు గోపాలం.

''పిచ్చివాడా...నువ్వూ మా వాడివే కాబట్టి'' అంటూ నవ్వేశారాయన.

''ఉద్యోగం కోసం నువ్వు పెట్టిన దరఖాస్తులో మీ ఇంటిపేరు చూశాను. కాస్త శ్రద్ధతో ఆరా తీస్తే తెలిసింది నువ్వూ మా వాడివేనని. ఇందాక భోజనాల సమయంలో చెప్పిన గోత్రం మీదే'' అన్నారాయన ఆప్యాయంగా గోపాలం భుజం తడుతూ.

---

# సరిగమలు... పదనిసలు...

ఒరేయ్ నాయనా... చాలామంది పాడతార్రా...కానీ ఘంటసాలగారి కంఠంలో ఒక జీర వుందిరా...అది ఆయనకు ఆ భగవంతుడిచ్చిన వరంరా... అంటూ కొడుక్కి హితబోధ చేశాడు ఓ పెద్దాయన. ఆ అన్నది ఎస్.పి. సాంబమూర్తి. ఈ విన్నది ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం. ఎన్నో సాధారణ రాగాలు ఘంటసాల గొంతులో కొత్త సొగసులు సంతరించుకునేవి. తెలుగు లలిత సంగీతం ఆయన బాణీతో సుసంపన్నమైంది. ఆయన పాటలన్నిటినీ ప్రస్తావించుకునేందుకు మనకు జీవిత కాలం సరిపోదు. మచ్చుకు కొన్ని తీపి జ్ఞాపకాలు...*1944* సెప్టెంబర్ *30*న ఘంటసాల రేడియోలో తన తొలి కచేరీ చేశారు. ఆ తరువాత కొద్దిరోజులకే స్వర్గసీమ సినిమాలో నారాయణరావుకు పాడి సినిమా రంగ ప్రవేశం చేశారు. కానీ పదిమందికీ తెలిసింది కీలుగుర్రం సినిమాతో. తెరమీద నేపథ్యగాయకునిగా ఆయన పేరు వచ్చింది మాత్రం లైలామజ్నూలో. ఆ సినిమా చూసి నటి జి.వరలక్ష్మి ఎంతబాగా పాడావు ఘంటసాల అంటూ ఆయన బుగ్గమీద ముద్దుపెట్టుకున్న వైనం గురించి సావిత్రమ్మ ఇప్పటికీ తలచుకుంటారు. మనదేశం సినిమాలో నేపథ్యంలో వచ్చే వ్యాఖ్యానం ఘంటసాల చేత చెప్పించారు. పరిశ్రమకు వచ్చిన నాలుగేళ్ళకే ఆయన గొంతు ఎంత ప్రాశస్త్యం సంపాదించుకున్నదో చెబుతుందిది. సంగీత కల్పనలో అవధులులేని ప్రతిభ రాజేశ్వరరావుదయితే, ఆబాల గోపాలాన్నీ సమ్మోహన పరిచి ఆనందాబ్ధిలో ఓలలాడించిన గాత్రమహిమ ఘంటసాలది. అందుకు తిరుగులేని సాక్ష్యం మల్లీశ్వరి. అలాగే దేవదాసు సినిమా...నటునిగా అక్కినేనికి, గాయకునిగా ఘంటసాలకు ఆ చిత్రం అనంత యశస్సును అందించింది. జగమే మాయ పాట పాడకుండా ఆరోజుల్లో ఆయన కచేరీ ఏదీ ముగిసేది కాదు. చివరగా 'సినిమాలో కూడా ఈ పాటలో దగ్గు నాదే బాబూ' అంటూ చమత్కరించేవారు. తెనాలి రామకృష్ణ సినిమాలో పాటలన్నీ ఒక ఎత్తయితే, పద్యాలన్నీ ఒక ఎత్తు. అయితే పద్యాలకు ఘంటసాల పారితోషికం తీసుకోలేదు. చిన్న పద్యాలు... వాటికి పారితోషికమేమిటండి అంటూ సున్నితంగా తిరస్కరించారట. కానీ నిర్మాత, దర్శకుడు బి.ఎస్.రంగా పద్యానికి వంద చొప్పున లెక్కగట్టి ఆ మొత్తాన్ని స్వయంగా ఇంటికి వచ్చి ఇచ్చి వెళ్లారని సావిత్రమ్మ గుర్తుచేసుకుంటారు. జయభేరి సినిమాలో రాగమయి రావే, రసికరాజ తగువారము కామా...పాటలు మర్చిపోయిన తెలుగువాడు ఎవడైనా వుంటాడా? రెండోపాటకు ఆయన పదిరోజులు ప్రాక్టీసు చేసారంటే అది ఆయనలోని వినయమే చెబుతుంది మరి. వెంకటేశ్వర మహత్మ్యం సినిమాలో శేషశైలావాస శ్రీవెంకటేశా...పాటను కాలానికీ, అభిరుచులకూ ముడిపెట్టి మాటాడే దమ్ము ఎవరికైనా వుంటుందా? ఘంటసాలను మనం తెరపైనకూడా గానమయ్యగా చూసే భాగ్యం ఈ పాటలో కలుగుతుంది. అక్కినేని-సావిత్రి జంటను అజరామరంగా నిలిపిన మూగమనసులు సినిమాలోని ముద్దబంతి పూవులో పాట గుబాళింపు ఎన్నేళ్ళకయినా తరుగుతుందా? ఏకవీరలో ప్రతిరాత్రి వసంతరాత్రి పాటను రోజులో ఏ వేళను తలచుకున్నా అది ఆనందక్షణం కాదా? అక్కినేని చేత చిందులు వేయించి తెలుగు సినిమా పాటను కొత్తదారికి మళ్లించిన ఎట్టాగొవున్నాది ఓ లమ్మీ పాటలో ఘంటసాల గళం బలాన్ని తూకం వేసే షరాబు వున్నాడా? అదే అక్కినేనిచేత హృద్యంగా అభినయం చేయించిన తేటతేటతెలుగులా...పాట మరిచిపోయే మనసుంటుందా? క్లాస్ పాటలేగాదు మాస్ పాటలు కూడా ఆయనకు కొట్టిన పిండి. సంపూర్ణరామాయణం సినిమాలో గుహుడికి పాడిన రామయ తండ్రి...పాట ఓ సారి గుర్తుకు తెచ్చుకోండి. ఆరోజుల్లో తెలుగుదేశాన ఏ థియేటరయినా రావులపర్తి భద్రిరాజు రాయగా ఘంటసాల పాడిన ప్రయివేటు రికార్డులు నమో వెంకటేశా నమో తిరుమలేశా, ఏడుకొండలస్వామి ఎక్కడున్నావయ్యా... వేయకుండా అసలు ప్రదర్శన ప్రారంభించేవారా? *1946*లో పేకేటి శివరాం హెచ్. ఎం.వి.లో ఆర్కెస్ట్రా ఇన్‌ఛార్జ్ అయ్యాక ఘంటసాల గానం చేసిన తొలి ప్రయివేటు పాటలను రికార్డు చేశారు. కపిలవాయి రామనాథశాస్త్రి తరువాత హెచ్.ఎం.వి.వారికి మళ్ళీ అంతటి లాభసాటి గాయకుడు ఘంటసాలే అని వి.ఎ.కె.రంగారావంటారు. కరుణశ్రీ రాసిన పుష్పవిలాపం, కుంతీకుమారి పద్యాలు, రావోయి బంగారు మావ, పోలీసెంకటసామి, అత్తలేని కోడలుత్తమురాలు, పొలాలనన్నీ హలాల దున్నీ, ఆనందం అర్ణవమైతే, తలనిండ పూదండ దాల్చిన రాణి, నీ కొండకు నీవే రప్పించుకో...పాటలు ఈ విషయాన్ని ధృవీకరిస్తాయి. ఘంటసాల చివరగా పాడింది యశోదాకృష్ణ సినిమాలో చక్కని వాడే బలే టక్కరివాడే...పాట. ఆ తరువాత ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. తన జీవితమంతా పరితపించిన భగవద్గీత ప్రయివేటు రికార్డు పూర్తిచేసి మరణించడం గాయకునిగా ఆయనకు దక్కిన చివరి సంతృప్తి.

